18వ
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,29 నవంబర్ 2024


## "యువాత్మ" చే ప్రముఖ సైంటిస్ట్ డా.జయతీర్థకు ఘన పురస్కారం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మధ్వ సమాజంలో ఉన్నటువంటి ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీ ప్రియ శిష్యులైన డాక్టర్ జయతీర్థ రాఘవేంద్ర జోషిని అత్యంత ఉన్నత స్థానంలో ఉన్న డి.ఆర్.డి.ఎల్. బ్రహ్మోస్ లాంటి విభాగానికి ఉన్నత అధికారిగా దేశ రాజధానిలో బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా భాగ్యనగర యువాత్మ బృందం ఘనంగా ఆయన స్వగృహంలో సత్కరించింది. యువాత్మ వ్యవస్థాపకులు సుధా పండితులు కానుగోవి వాసుదేవాచార్ ఆధ్వర్యంలో ఈ బృందం డాక్టర్ జయతీర్థ ను భద్రాచల రాములు వారికి శ్రీ స్వామీజీ బహుకరించిన స్వర్ణఖడ్గం పై ఉన్న శ్లోకంతో రచించిన ఖడ్గంను మరియు ప్రత్యేక సన్మాన పత్రంతోనూ సన్మానించారు.

ఈ సందర్భంగా పండిత వాసుదేవాచార్ మాట్లాడుతూ శ్రీ మూల రామచంద్రుని, దుర్గా, ముఖ్య ప్రాణుల, గురువుల కృపతో "బాలస్య మూలం విజ్ఞానం" అనే ఆర్యోక్తి ని నిజం చేస్తూ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థ అయిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ కొత్త చీఫ్‌గా ఆయన నియమితులై బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా శ్రీ స్వామీజీ ఆశీస్సులతో ఈ విశేష సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. డా.జయతీర్థ ఆధ్వర్యంలో ప్రపంచ దేశాలలో అగ్రగామిగా భారతదేశం నిలబడుతుందని అందుకు అనుగుణంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచన విధానాలకు అనుగుణంగా ఈ విభాగాన్ని మరింతగా బలోపేతం చేస్తారన్న ఆకాంక్షను వాసుదేవాచార్ ఆచార్ వ్యక్తం చేసారు.బ్రహ్మోస్ ఏరో స్పేస్ కొత్త చీఫ్ గా బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఉత్తరాది మఠ దివాన్ సుధా పండితులు శశి ఆచార్, కాకినాడ మాధ్వసభ కమిటీ ఉపాధ్యక్షులు తాడూరి రంగారావు, కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ యాతగిరి పరశురామ్, కోశాధికారి వేముగంటి రాము, కార్యవర్గ సభ్యులు రాచూరి శేషగిరిరావు, జాగీర్దార్ ప్రేమకుమార్ మధ్వయువజన కమిటీ అధ్యక్షులు యాతగిరి మద్వేష్ తో పాటు పలువురు అభినందన సందేశాన్ని పంపారు.

# వేగ జ్యువెలర్స్ అక్రమాలు

## ఇంటి నిర్మాణం పేరుతో కమర్షియల్ కాంప్లెక్స్



వేగా జ్యువెలర్స్ అక్రమ నిర్మాణం


సూర్య
అక్రమ కట్టడాలు!
రూ.లక్షల్లో మింగేశారు
ఈ అక్రమ నిర్మాణంపై గత సంవత్సరం ఆగష్టులో సూర్య పేపర్‌లో ప్రచురితమైన కథనం

- నిర్మాణం అక్రమమని తెలిసినా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- గతంలో సూర్య కథనంతో తూతూ మంత్రంగా నోటీసులు జారీ
- నిబంధనలు అతిక్రమించి సెల్లార్ నిర్మాణం
- ఇంటి నిర్మాణ అనుమతులతో బరితెగించి అక్రమంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం
- నాలుగు వైపులా సెట్‌బ్యాక్స్‌కి స్థలం విడిచిపెట్టకుండా నిర్మాణాలు
- అగ్నిప్రమాదం జరిగితే తీవ్ర ప్రమాదం ప్రాణనష్టం ...
- ఫైర్ ఎన్‌వోసీ, ఆక్యుపెన్సీ లేవు..
- పెద్ద రోడ్డుపైనే జనరేటర్ -, మెట్ల ర్యాంప్
- అనుమతులు పొందిన ప్లానుకి మించి పైపై అంతస్తుల నిర్మాణాలు
- ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరు...?
- టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నట్లు ... మండుతున్న అవినీతి.!
- కమిషనర్ భావన చర్యలపై ప్రజలు వినతి



అక్రమంగా సెల్లార్, మెట్ల ర్యాంపు నిర్మాణం

కాకినాడ స్మార్ట్ సిటీ నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. రాష్ట్రంలో మూడవ పెద్దనగరంగా అభివృద్ధి చెందడానికి అన్ని అవకాశాలు ఉన్న నగరం కాకినాడ. నగరాభివృద్ధితోపాటు సరైన రీతిలో రోడ్లు, డ్రైన్లు,షాపింగ్ కాంప్లెక్స్‌లు బహుళ అంతస్తుల భవనాలు తీర్చిదిద్దితేనే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. కానీ అక్రమ నిర్మాణాల వల్ల ఇంటి నిర్మాణాలకు అనుమతులు పొంది కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తుంటే నగరం ఇరుకుగా మారింది. అడ్డగోలుగా ట్రాఫిక్ పెరిగిపోయింది. ఉదయం నుంచి రాత్రి పదిగంటల వరకు వాహనాలు, ట్రాఫిక్‌తో ప్రజలు నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. నగరంలో ఒకచోట నుంచి మరోచోటకి వెళ్ళాలి అంటే సమయం వెచ్చించాల్సి వస్తోంది. దీనికి కేవలం నగరంలోని అడ్డగోలు అక్రమ నిర్మాణాలు కారణమని వేరే చెప్పనక్కరలేదు. బాలాజీచెరువు సెంటర్ వద్ద పి.ఆర్. జూనియర్ ఇంటర్ కాలేజీ ఎదురుగా వేగ జ్యువెల్లరీ మాల్ ఏర్పాటుకు భవన నిర్మాణ పనులు చక్కగా జరిగిపోతున్నాయి. ఈ భవంతి ఇంటి నిర్మాణం పేరుతో నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ నుంచి అనుమతులు తీసుకుని కమర్షియల్ భవంతి నిర్మించడం అంతా అక్రమమే. పైగా ఎటువంటి సెట్‌బ్యాక్స్ వదలకుండా మొత్తం స్థలం అంతా నిర్మాణం చేసేసారు. కనీసం ముందువైపు వదలాల్సిన సెట్‌బ్యాక్స్ వదలకుండా రోడ్డును ఆక్రమించి జనరేటర్, మెట్ల ర్యాంపు ఏర్పాటు చేసేశారు. ఇంటి అనుమతులు పొంది, కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌తో వేగ జ్యువెల్లరీ ఏర్పాటుకు పనులు చేస్తున్నారు. అక్రమంగా భూలోతుల్లో తవ్వి సెల్లార్ నిర్మించారు. సూర్య పేపర్లో ప్రత్యేక కథనం గతంలో రావడంతో ఈ అక్రమంపై నోటీసులు జారీ చేసి టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులు దులుపుకొని... మామూళ్ళ మత్తులో జోగారు. కొన్నాళ్లు నిర్మాణం నిలిపేసి తరువాత పరదాల చాటున నిర్మాణాలు కానిచ్చేశారు. ఇప్పటికైనా ఆ అక్రమ భవంతిపై చర్యలు తీసుకోవాలని నగరాభివృద్ధి సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. వేగ జ్యువెల్లరీ బరి తెగింపుపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన పరిశీలనాత్మక కథనం...

- మిగతా 2 లో..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

## తుఫాను కారణంగా జాగ్రత్తలు పాటించాలి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** తుపాను కారణంగా వరి సాగు రైతులు జాగ్రత్తలు పాటించాలని తాసిల్దార్ టి.ఆర్.రాజేశ్వరరావు, వ్యవసాయ అధికారి భార్గవ్ మహేష్ ు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వా వరి పంట కోత మాసూళ్ళు చేపట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు, కోత యంత్రాలు అవసరం మేరకు లేకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి, మండలంలోని 4వేల 600 వరి సాగు చేయగా ఇప్పటివరకు 18 ఎకరాల్లో వరి కోతలు జరిగాయి, తుఫాను నేపథ్యంలో కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా భద్రపరచుకోవాలన్నారు. అల్పపీడంతో శుక్రవారం నుండి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు వరి కోతలు నిలుపుదల చేయాలని ఎప్పటికీ కోసి మాసూళు చేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లుకు తరలించడానికి రైతు సేవ కేంద్రాల సిబ్బంది సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. తాసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ నెంబర్.7989680442.

## వెంకన్న ఆలయంలో టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు ప్రత్యేక పూజలు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్.నాయుడు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకున్న టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తరపున దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు స్వాగతం పలికారు. అనంతరం వాడపల్లి ఆలయంలో టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయడుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మండల టిడిపి అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆలయ వేద పండితులు వేద వచనాలు పలుకుతూ స్వాగతం పలికి స్వామివారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడు దంపతులకు కుటుంబ సభ్యులకు బహుకరించారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంతో పోటీపడుతూ కోనసీమలో వాడపల్లి వెంకటేశ్వరస్వామి భక్త జననీరాజనాలు అందుకుంటున్నారని అన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి చేపడుతున్న మాస్టర్ ప్లాన్ గురించి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడుకు వివరించారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు తదితరులు ఉన్నారు.

## పిల్లి మాణిక్యాలరావును మర్యాదపూర్వకంగా కలిసిన తెదేపా శ్రేణులు




**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర లెదర్ ఇండస్ట్రీ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన పిల్లి మాణిక్యాలరావును విజయవాడ తాడేపల్లిలో లిడ్ క్యాప్ క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ రాష్ట్ర ఎస్సి సెల్ కార్యనిర్వాహన కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ ఎస్సి సెల్ కార్యదర్శి తోత్తరమూడి శ్రీనివాస్, జాతీయ ఎమ్మార్పిఎస్ నాయకులు మంద వెంకటేష్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి చైర్మన్ పిల్లి మాణిక్యాలరావుకు శుభాకాంక్షలు తెలియజేసి అయినవిల్లి మండలంలో కొలువై ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక చిత్రపటాన్ని బహుకరించి దుస్సాల్వతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పిల్లి.మాణిక్యాలరావు మాట్లాడుతూ లిడ్ క్యాప్ నిధుల ద్వారా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి నిధులు అందజేసి వారిని అభివృద్ధి పరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశమని ఆయన తెలియజేశారు.

## ఎర్రమట్టి క్వారీలను పరిశీలించిన 'సిపిఎం' బృందం

**- బాధ్యులపై క్రిమినల్ చర్యలకు డిమాండ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఎర్రమట్టి క్వారీలను సిపిఎం పార్టీ నాయకులు గురువారం పరిశీలించారు. దేవీపట్నం మండలంలో అక్రమంగా జరుగుతున్న ఎర్రమట్టి క్వారీలను సిపిఎం బృందం పరిశీలించినట్లు విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఎర్రమట్టి క్వారీలపై జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో అక్రమ ఎర్రమట్టి తరలింపుపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలన్నారు. అనుమతులు లేకుండా ఎర్రమట్టి తరలించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోత రామారావు, యం.వాణిశ్రీ, పల్లపు వెంకట్, మడకం సంకురమ్మ, వెంకటేశ్వరరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

# రబ్బరు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి





**- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రబ్బరు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మారేడుమిల్లి మండలం పూజారి పాకల రబ్బరు ప్రాసెస్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ గురువారం పరిశీలించారు. ముందుగా రబ్బరు పాలు ఏ విధంగా ప్రాసెస్ చేస్తున్నది జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రబ్బరు రైతులతో జిల్లా కలెక్టర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో రబ్బరు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా రబ్బర్ ప్రాసెస్ యూనిట్ షెడ్లు,స్మోక్‌రూములు ఏర్పాటుకుచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఒక సంవత్సరంలో ఎన్ని నెలలు రబ్బరు చెట్టు నుండి పాలు తీస్తున్నది, అదేవిధంగా ఒకరోజుకు ఒక చెట్టుకు ఎన్ని రబ్బరు పాలు వస్తాయి ఒక సంవత్సరంలో ఒక ఎకరానికి ఎన్ని కిలోల రబ్బరు సీట్లు తయారు చేస్తున్నారు, అదేవిధంగా ఒక ఎకరానికి ఎంత ఆదాయం వస్తుంది రబ్బరు రైతులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఈప్రాంతంలో ఎన్ని ఎకరాలలో రబ్బరు ప్లాటిషన్ వలన ఎంతమంది రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందినది ఆయన ఆరా తీశారు. ఈ ప్రాంతంలోని రబ్బరు రైతులు ఒక ఐదుగురు సభ్యులను ఎంపిక చేసి సొసైటీగా ఏర్పడి అభివృద్ధి చేసుకోవాలన్నారు. సొసైటీగా ఏర్పడిన సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒక రబ్బరు చెట్టు ఎన్ని సంవత్సరాల వరకు పాలు తీయవచ్చు ఆయన ఆరా తీశారు. రబ్బర్ ప్రాసెస్ షెడ్డు, స్మోక్ రూమ్ షెడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేసిసమర్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మారేడుమిల్లి నేచురల్ ప్రొడక్షన్ ఫౌండేషన్ (యం.సి.ఇ.సి.డి.పి.) ద్వారా సుమారు 200 మంది సభ్యులు ఉన్నామని, తాము ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు రూ.10 కోట్లు మంజూరు చేయాలని సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, దొరి సోమయ్య, రామిరెడ్డి, కథల మొట్టి రెడ్డి, గొర్లె చిన్న నారాయణరావు, గొర్లె మురళీకృష్ణ, గొర్లె అనిల్ ప్రసాద్, పి.జానకి రెడ్డి వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. అన్ని విషయాలు పరిశీలించి ఈ ఫౌండేషన్‌కు రూ.ఐదులక్షల రూపాయలు లోను ముందుగా మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఈవిషయాన్ని పర్యవేక్షించుట కొరకు రంపచోడవరం సబ్ కలెక్టర్ ను నోడల్ అధికారిగా నియమించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కొత్తగా రబ్బరు రైతులకు మొక్కల సంరక్షణ కొరకు ఉపాధి హామీ పథకం ద్వారా సంవత్సరానికి రూ. 50వేలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మినీ పరిశ్రమలు ఏర్పాటు చేయుటకు గిరిజన సభ్యులకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కూడూరు నుండి పందిరిమామిడి కోట వరకు రెండు కిలోమీటర్లు రహదారి ఏర్పాటు చేయాలని పి.జానకి రెడ్డి వినతి పత్రాన్ని సమర్పించారు. అదేవిధంగా వేటుకూరు గ్రామంలో పశువుల వలన వ్యవసాయలు చేయలేకపోతున్నామని గోకులం షెడ్లు ఏర్పాటు చేయాలని కథల మొట్టి రెడ్డి దరఖాస్తు సమర్పించగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి మారేడుమిల్లి, వై.రామవరం మండలాలకు రెండు చొప్పున గోకులం షెడ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని ఆకుమామిడికోట నుండి గుర్తేడు వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలని అదేవిధంగా ఎడ్లకొండ, జి.వట్టిగడ్డ గ్రామాలకు కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేయాలని అదేవిధంగా పాతకోట వరకు ప్రస్తుతం ఒక బస్సు తిరుగుతుందని ఒక బస్సు సరిపోవడం లేదని రెండో బస్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా గుర్తేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులను సిబ్బందిని గిరిజనుల వైద్యం కొరకు అదనంగా ఏర్పాటు చేయాలని, అదే విధంగా రావడికోట, జి.వట్టిగడ్డ గ్రామాలలో పక్కా స్కూల్ భవనాలు ఏర్పాటు చేయాలని గుర్తేడు పంచాయితీ సర్పంచ్ గొర్లె దుష్యంతుడు వినతి పత్రాన్ని సమర్పించారు.

మారేడుమిల్లి మండలం పాములేరు పంచాయతీలో కొండకాలువ భారీవర్షాలకు కల్వర్టు కొట్టుకు పోయిందని కల్వర్టు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా పాములేరు పంచాయతీ సచివాలయం భవన పనులు వెల్ సెంటర్ పనులు పూర్తి చేయించాలని పాములేరు పంచాయతీ సర్పంచ్ సార్ల రమాదేవి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఓ కె.చిట్టిబాబు, ఉపాధిహామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, ఏఈ సత్యనారాయణ, మారేడుమిల్లి ఎంపీడీవో విశ్వనాథ్, తాసిల్దార్ బాలాజీ పాల్గొన్నారు.

## ఫెంగల్ తుఫాన్‌తో అప్రమత్తం

**- కొత్తపేట ఆర్.డి.ఓ. శ్రీకర్**



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఫెంగల్ తుఫాన్‌గా మారిన నేపథ్యంలో రైతులందరూ ఎంతో అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఆర్.డి.ఓ. పి.శ్రీకర్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని చిరతపూడిలో వరిచేలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో రైతులు కోసిన వరి చేలను ఒబ్బిడి చేయూకోవాలన్నారు. కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. కోసిన వరి పనలను తడవనీయ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని మొలకెత్తకుండా ఉప్పు నీటి ద్రావనాన్ని చల్లాలన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి రిజిస్టర్ లు తనిఖీ చేసారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి 6 నుండి7 మిల్లులను జతచేసామన్నారు.తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్న ధ్యానాన్ని మిల్లులకు తరలించు కోవాలన్నారు. రానున్న ఎమ్.ఎల్.సి ఎన్నిక సందర్భంగా స్థానిక హైస్కూలులో ఉన్న పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. అనంతరం పదవతరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆర్.డి.ఓ శ్రీకర్ ఉపాధ్యాయుని అవతారం ఎత్తి విద్యార్థులను పలు సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం ఏ విధంగా ఉందో నాణ్యతను అడిగి తెలుసుకున్నారు.ప్రతి విద్యార్థి ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు.స్థానిక హైస్కూలులో ప్రధానమంత్రి స్కూల్ రైజింగ్ పథకంలో భాగంగా రూ.15.58 లక్షలతో ఏర్పాటు చేస్తున్న రసాయన ప్రయోగశాల, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులను పరిశీలించారు. ఆర్.డి.ఓ వెంట స్థానిక తహశీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎం.పి.డి.ఓ,వి.సరోవర్, ఆర్.ఐ. ఏడుకొండలు, ఇంచార్జి హెచ్.ఎం. బి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు వి.ఎస్.ఎన్.మూర్తి, బి.ఎస్.ఎన్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి గురువారం రాజమండ్రికి చెందిన గంగిన వెంకట సత్యనారాయణ వారి కుటుంబ సభ్యులు లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు స్వామివారి చిత్రపటం అందించారు.

## జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు మెర్లపాలెం విద్యార్థిని



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని మెర్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న రంకిరెడ్డి కళ్యాణి రేవతి ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల నెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి టీం తరుపున ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావటం జరిగింది. డిసెంబర్ నెల 11 నుండి 15వ తారీఖు వరకు పంజాబ్ రాష్ట్రం లుధియానాలో జరగబోవు జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నెట్ బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.శ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనపరచడంతో గ్రామ సర్పంచ్ మెర్ల రాము, పాఠశాల చైర్మన్ పువ్వల లక్ష్మీనారాయణ, నాగరాజు పలువురు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు విద్యార్థినికి అభినందనలు తెలియచేశారు.

# మంచి ఆరోగ్యంతో ప్రజలకు సేవ చేయాలి

**– 'వన సమారాధన'లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది మంచి ఆరోగ్యంతో ఉండి ఉత్సాహంగా ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆకాంక్షించారు. మారేడుమిల్లి సమీపంలోని వన విహారి, జలతరంగిణి వద్ద కార్తీక మాసం సందర్భంగా గురువారం వన విహారం కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్ప శ్రీ, రంపచోడవరం డివిజనల్ ఫారెస్ట్ అధికారి రవీంద్రదామ, రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జీ సాయి ప్రశాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో వన్‌సమారాధన నిర్వహించుకుని కుటుంబ సభ్యులతో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది సంతోషంగా ఉండే విధంగా ఇటువంటి కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ శాఖల్లో అధికారులు, సిబ్బంది ఆరోగ్యంగా ఉండే విధంగా వ్యాయామం, యోగ చేయాలన్నారు. వన



సమారాధనలో మహిళలకు చైర్ పోటీలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం రంపచోడవరం ఐటీడీఏ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అదేవిధంగా వన సమారాధన ఏర్పాట్లు చేసిన మారేడుమిల్లి ఎంపీడీవో విశ్వనాథ్, ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్‌వి రమణ, తాసిల్దార్ బాలాజీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, పిహెచ్ఓ కె.చిట్టిబాబు,



డీఏవో రాంబాబు, ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు, ఏడిఏసిహెచ్ కె.వి.చౌదరి, ఫారెస్ట్ రేంజ్ అధికారులు అనుష, ఏడు కొండలు, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, సిడిపిఓలు సంధ్యారాణి, లక్ష్మీప్రసన్న, తాసిల్దారులుసత్యనారాయణ, కె.సూర్య నారాయణ, ఎంపీడీవోలు శ్రీనివాసరావు దొర, కె.రాజమణి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ సూర్యనారాయణ, డిప్యూటీ ఇంజనీర్లు సాయి సతీష్, పి.వెంకటరమణ, ఎఇ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారు లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ వైద్యపరీక్షలు చేయించుకోవాలి



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ప్రస్తుత వాతావరణంలో ప్రతీ ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని కమ్యూనిటీ హెల్త్ అధికారి బి.అప్పారావు తెలిపారు. మాచవరం సచివాలయం-4 కుమ్మరివీధిలో వైద్యపరీక్షలపై గురువారం అవగహాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, రక్త శాతం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లపై 18 ఏళ్లు నిండిన వారికి అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎలెచ్పీ సూర్యకుమారి, ఎంపీహెచ్‌ఎ వి.మురళీ కృష్ణ. ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

## సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**– సాయిధ దళాలు చేస్తున్న కృషిని గుర్తు చేసుకుంటూ ధారాళంగా విరాళాలు ఇవ్వాలని పిలుపు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సాయుధ బలగల జెండా దినోత్సవం పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు మాసములో ఏడవ తేదిన నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. సాయుధ దళాలు దేశరక్షణ కొరకు అహర్నిశలు కృషిచేస్తాయని అనునిత్యం మన భద్రతను, దేశ క్షేమానికి సంబంధించి నిరంతరం పోరాటం చేస్తుంటారని ఆయన పేర్కొన్నారు. మాజి సైనికులు, యుద్ధ వితంతువులు సంక్షేమం కోసం ఫ్లాగ్ డే సంధర్భంగా మనం అందించే విరాళాలు ఒక మంచి కార్యక్రమం కోసం సద్వినియోగం చేసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సాయుధ దళాలు కోసం ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలన్నారు. విరాళాలు అందచేసే వ్యక్తులు సంస్థలు, జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయం వారి పేరు మీద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. జిల్లా పరిషత్ శాఖ, కాకినాడ బ్రాంచ్‌లోని ఖాతా సంఖ్య 62064060623 ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్0020974 నేరుగా జమ చేయవచ్చునని ఆయన తెలిపారు. ఈ విరాళాలు అందచేసేవారికి ఆదాయం పన్ను నుంచి మినహాయింపులు వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

## రాష్ట్ర కొప్పుల వెలమ డైరెక్టర్‌గా పైల సాంబశివ



**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** రౌతులపూడి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు రాష్ట్ర కొప్పుల వెలమ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తెలుగు దేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాపై నమ్మకం ఉంచి డైరెక్టర్‌గా నియమించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలు మారిన నాయకులు మారిన తెలుగు దేశం పార్టీ నా ఊపిరి అంటూ ఆయన పదే పదే చెబుతూ ఉండేవారు. పార్టీలకు అతీతంగా కొప్పులు వెలమ అభివృద్ధి కొరకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన ఎంపిక పట్ల మండలంలోని పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రివర్యులు లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**– వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గం ఇంచార్జ్ తలారి**




**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గం ఇంచార్జ్ తలారి వెంకట్రావు అన్నారు. గురువారం కొవ్వూరు లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో కూటమి ప్రభుత్వ ఆరు నెలల పాలనపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికలలో అబద్ధపు హామీలను ఇచ్చి అధికారాన్ని దక్కించుకున్న కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధిని కోల్పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచిన సూపర్ సెక్స్ పథకాలను విస్మరించిందన్నారు. అధికారం చేపట్టిన నాటినుండి దోచుకోవడం దాచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఎక్కడ చూసినా అవినీతిమయమన్నారు ఉచిత ఇసుక అమలు చేస్తానని చెప్పి అడ్డంగా దోచుకుంటున్నారని ప్రభుత్వం ఖజానాల్లోకి వెళ్ళవలసిన ఇసుక, మద్యం సొమ్ము తెలుగు తమ్ముళ్ల జేబులలోకి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవగుప్తాపు లక్ష్మణరావు, ఉప్పులూరు సూరిబాబు, చెల్లంకుల దుర్గా మల్లేశ్వరరావు, గంధ్రోతు సురేంద్ర, బోడపాటి హనుమంతరావు, గుబతాల సురేష్, బత్తి నాగరాజు, మద్దిపట్ల సాయి గీత, మద్దిపట్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

**– మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, మరియు అమ్మకాలకు సంబంధించి ప్రతి నెలా ఏర్పాటు చేసే మెప్మా అర్బన్ మార్కెట్‌ను కాకినాడ నగరంలో గురువారం ఉదయం ప్రారంభించారు. కాకినాడ నగరంలోని రిజర్వ్ పోలీసు లైన్ సమీపంలోని ఉన్న ఓల్డ్ మీ సేవ కేంద్రంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. నగరంలోని పలు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన పలు ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు. ఈ ప్రదర్శనను టీపీఆర్వో కె.శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఓలు, సెల్లర్ పాయింట్ డీఆర్‌పీ అమృత కల్యాణి, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో పలు ఉత్పత్తులను ప్రదర్శించారు. నగర ప్రజలు ఈ అర్బన్ మార్కెట్‌ను సందర్శించి మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు.

# వేగ జ్యువెలర్స్ అక్రమాలు

## ఇంటి నిర్మాణం పేరుతో కమర్షియల్ కాంప్లెక్స్

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

ఓవైపు ఆరోపణలు... మరోవైపు విమర్శలు... అయినా కాకినాడ స్మార్ట్ సిటీ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు మారడం లేదు. నిజాయితీ గల అధికారిగా ఎసిపి వరహాలబాబుకి మంచి పేరుంది. ఆయన పర్యవేక్షణలో తీరు మారవచ్చని చాలావరకు ప్రక్షాళన జరుగుతుందని తెలుస్తోంది. అయితే గత ప్రభుత్వం, గత ప్లానింగ్ అధికారులు, గత ప్రజాపాలకుల అవినీతి వల్ల అక్రమాలు జరిగాయి. అప్పుడే అదే కోవలో బాలాజీ చెరువు సెంటర్ వద్ద పి.ఆర్.జూనియర్ కాలేజీ ఎదురుగా నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ఇంటి అవసరాల కోసం అనుమతులు తీసుకుని కమర్షియల్ నిర్మాణం చేస్తూ అందులో వేగ జ్యువెలరీ షాపింగ్ మాల్ ఏర్పాటుకు చురుకుగా పనులు జరుగుతున్నాయి. ఈ భవనానికి అనుమతులు ఇంటి కోసం ఇచ్చారు. బెడ్‌రూము, హాలు, కిచెన్ మాత్రమే నిర్మించాలి. అలాగే సిల్ట్‌లో పార్కింగ్ వదలాలి. కానీ అక్రమంగా భూపొరలలోకి భూమిని తొలచి సెల్లార్‌గా నిర్మాణాలు చేశారు. స్థలం చుట్టూ నాలుగువైపులా విశాలమైన సెట్‌బ్యాక్స్ వదలాలి. కానీ అడుగు కూడా వదలకుండా మొత్తం నిర్మాణాలు చేసేసారు. పైనుంచి క్రిందవరకు ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టేశారు. అనుమతులు లేని పై అంతస్థులు కూడా నిర్మించారు. ఈ నిర్మాణంపై గతంలో సూర్యలో ప్రత్యేక కథనం వచ్చింది. నోటీసులు ఇచ్చి నిలుపుదల చేసేశారు. కొన్ని నెలల నిర్మాణం ఆగిపోయింది. పరదాలు కట్టి పరదాల చాటున నిర్మాణం కానిచ్చేశారు. నేడు మళ్ళీ అదే అక్రమంతో నిర్మాణం ముందుకు కానిచ్చేస్తున్నారు. లోపల ప్రమాదం సంభవిస్తే బయటికి రావడానికి ఒక్కటే మార్గం వుంది. ఫైర్ సేఫ్టీ ఎన్‌వోపీ కానీ నగరపాలక సంస్థ ఆక్యుపెన్సీ కానీ లేదు. యధేచ్ఛగా అక్రమాల పుట్టగా నిర్మాణం సాగిస్తున్నారు.

**ఇంటి ప్లాన్‌తో కమర్షియల్ నిర్మాణం...**

బాలాజీ చెరువు సెంటర్‌లో వేగ జ్యువెలరీ భవంతి అక్రమ నిర్మాణం. నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి ఇంటి నిర్మాణానికి అనుమతులు పొందారు. కానీ ప్లానుకు వ్యతిరేకంగా భూపొరలు తొలచి సెల్లార్ నిర్మాణం చేపట్టారు. అప్పుడే అడ్డుకొని నోటీసులు జారీ చేసి నిర్మాణాన్ని నిలుపుదల చేయాల్సిన ప్లానింగ్ అధికారులు మామూళ్ళ మత్తులో జోగారు. అప్పటి ప్రజాప్రతినిధుల అండతో యాజమాన్యం బరితెగించి అక్రమ నిర్మాణాలు సాగించింది.

అప్పుడే గత సంవత్సరంలో సూర్యలో ప్రత్యే కథనం ఈ నిర్మాణంపై ఇవ్వగా నోటీసులు ఇచ్చి నిలుపుదల చేశారు. తరువాత మళ్ళీ యదేచ్ఛగా అక్రమ నిర్మాణం సాగిపోయింది. ఇప్పుడు ఈ కమర్షియల్ భవంతి వలన ప్రజల ప్రాణాలకు హాని వుంది. ఏద్కెనా ప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలుంటాయి. కావున జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, నగర కమిషనర్ భావనలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 'బాల్య వివాహ ముక్త భారత్'కు స్వాగతం పలికేందుకు ర్యాలీ









రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ : ఈస్ట్ గోదావరి జిల్లాలో 'బాల్య వివాహ ముక్త భారత్'కు స్వాగతం పలికేందుకు ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాలను ఆపే ఈ ప్రచారంతో చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్, బాల్య వివాహాలను జరగకుండా ప్రతి గ్రామన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తూ ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞలు చేయిస్తూ వారిలో గ్రామస్తులు, ప్రభుత్వఅధికారులు, గ్రామపెద్దలు, అంగన్‌వాడిలు, ఆశలు, ఉపాధ్యాయులు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. దేశవ్యాప్తంగా బాలల హక్కుల పరిరక్షణ కోసం పని చేస్తున్న ఎన్జీవోల జాతీయ కూటమి జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ లో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ పార్ట్నర్ ఎన్జీవో గా తూర్పుగోదావరి జిల్లాలో కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

భారత ప్రభుత్వం 'బాల్య వివాహ ముక్త భారత్'కు పిలుపు మేరకు చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం, కడియం, కోరుకొండ, గోకవరం మండలాల్లో 50 గ్రామాలలో బాల్యవివాహ రహిత గ్రామాలను చేయటం కోసం అనేక అవగాహన మరియు ప్రతిజ్ఞా కార్యక్రమాలను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మహిళలు, పురుషులు కొవ్వొత్తులను పట్టుకొని ర్యాలీలు నిర్వహించడం, ప్రతిజ్ఞలు చేయడం, బాల్యవివాహాల పై అవగాహన కల్పించేందుకు అంగనవాడిలు, గ్రామస్తులు, ఆశలుకు, మహిళా పోలీసులు, విర్వో, పంచాయతీ సెక్రటరీ కూడా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. బాల్యవివాహాలను ఆపడానికి జిల్లాలో పని చేస్తున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జెఆర్సి) కూటమికి చెందిన 250 మందికి పైగా ఎన్జిఓ సభ్యులలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఒకరు. ఈ చైల్డ్ మ్యారేజ్ ముక్తా భారత్ కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గారు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌గారు లిచైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్, సీడీపీఓ గారు రాజానగరంలో అంగనవాడిలు ఆశలు గ్రామ మహిళా పోలీసులు, కలిసి ,ఎంపీడీఓ ఆఫీస్‌లో ప్రతిజ్ఞ చేయించటం జరిగింది. కేంద్ర మహిళా, శిశు శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి ప్రారంభించిన జాతీయ 'బాల్య వివాహ ముక్త భారత్' ప్రచారానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఎన్జీవో చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి తెలిపారు.

స్థానిక అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో మన జిల్లాలోని ఆడ పిల్లలను బాల్యవివాహాల నుంచి కాపాడేందుకు కృషి చేస్తున్నాం. ఈ జిల్లాలో తాము ప్రారంభించిన ప్రచారం ఇప్పుడు దేశవ్యాప్త ప్రచారం కావడం గర్వకారణమన్నారు.

## పరిశ్రమ తెరిపించి ప్రభుత్వం చోరవ తీసుకోవాలని కార్మికులు వినూత్న నిరసన



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఇంటర్ స్నాక్ క్యాషు ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చిన్నంపేట జీడిపిక్కల పరిశ్రమ తెరిపించి 409 మంది ఉపాధి కాపాడాలని కార్మికులు 13వ రోజు సాష్టాంగ నమస్కారం చేసి, కార్మికుల ఆదుకోవాలని నిరసన తెలియజేశారు .ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ కంపెనీ పరిశ్రమంలో గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు అర్ధాంతరంగా కంపెనీ మూసేయడం వల్ల కార్మికులు ఎక్కడకు పోవాలో అర్థం కాని అగమ్య గోచరంలో ఉన్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కంపెనీ తరిపించాలని ఈ సందర్భంగా అన్నారు. ప్రభుత్వ చట్ట వ్యతిరేక మూసివేత యాజమాన్యం చేసిందని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని కంపెనీ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ,చట్ట వ్యతిరేకంగా మూసేసిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా శిబిరానికి సిఐటియు గోలప్రోలు మండల కార్యదర్శి ఒరిగంటి నందేశ్వరరావు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, కె.చక్రధర్, ఎం.చంటి, ఎస్.జయలక్ష్మి, సిహెచ్. గోవిందు, టి.దేవి ,బి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ కాదు - ప్రజల కోరే పీపుల్స్ సిక్స్ సాధిద్దాం



**– సిపిఐ (యం ల్) రాష్ట్ర కార్యదర్శి బుగత**

**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** ప్రజా పోరాటాలనే నిజమైన ప్రతిపక్షంగా నిలబడిన సిపిఐ ఎంఎల్ లేబరేషన్ పార్టీ విజయవాడలో డిసెంబర్ 4న తలపెట్టిన ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని సిపిఐ ఎమ్ ల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు పిలుపునిచ్చారు. తెలుగు నేల నుంచి మత రాజకీయాలను తరిమేద్దాం అనే నినాదంతో ప్రజా హక్కుల సభ జరుగుతుందన్నారు. తెలుగు నేలపై లౌకిక స్ఫూర్తిని దెబ్బతీసేలా ప్రయత్నిస్తున్న ఆర్ఎస్ఎస్, బిజెపి కషాయ మత రాజకీయాలు చేస్తున్నాయని ఆ పని జరగనివ్వబోమనిఅన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన సొంత పార్టీ జనసేన కన్నా బిజెపికి విధేయుడుగా వ్యవరిస్తున్నారని ఆరోపించారు. సనాతన ధర్మ పేరుతో బిజెపి ఆర్ఎస్ఎస్ ల మతతత్వ ఎజెండను వారి కన్నా పవన్ ఎక్కువ నెత్తికెత్తూకున్నాడని అన్నారు. కేసులు భయంతో వైసిపి అటు ప్రజా ప్రయోజనాల కోసం కానీ,ఇటు మత రాజకీయాలను వ్యతిరేకించడం మాట్లాడలేని బలహీనతతో ఉందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా జరుగు ప్రజా హక్కుల సభను ప్రతి ఒక్కరూ విజయం చేయాలని ఆయన కోరారు

## ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ విజేతను

### అభినందించిన జిల్లా కలెక్టర్

కాకినాడ, మేజర్‌న్యూస్ : ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ విజేత మందపల్లి శ్రీనివాసరావును గురువారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. ఈ నెల 21నుంచి 23 వరకు పంజాబ్ ఖరార్ లో జరిగిన రైతు బారా యూనివర్సిటీ నిర్వహించిన ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో 550 మంది పవర్ లిఫ్టర్స్ పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఏపీఎస్‌ఆర్టీసీ సంస్థలో కాకినాడ డిపోలో డ్రైవర్‌గా పనిచేయుచున్న ఎం.శ్రీనివాసరావు 450 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలచి బంగారు పతకాన్ని సాధించారు. అదేవిధంగా జనవరి 2025లో బెంగుళూరులో జరగబోయే వరల్డ్ వైడ్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి ఎంపికైన సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస కుమార్ తో కలిసి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ స్థాయిలో కాకినాడ జిల్లాకు గుర్తింపు తిసుకువచ్చిన శ్రీనివాసరావును ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో అంతర్జాతీయ



స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి మన దేశానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# ట్రాఫిక్ పోలీసులకు యోగా తరగతులు



కాకినాడ,మేజర్‌న్యూస్ : ఏలూరు రేంజ్ ఐజిపి జి.వి.జి.అశోక్ కుమార్ సూచనల మేరకు, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో గురువారం ఉదయం కాకినాడ ఎస్‌డిపిఓ రఘువీర్ విష్ణు, యోగమాస్టర్ డాక్టర్ గురవప్ప కాకినాడ ట్రాఫిక్ పోలీస్‌లకు యోగ తరగతులు నిర్వహించారు. గురువారం ఉదయం 6:00 గంటల నుండి 7:30 గంటల వరకు, "పోలీస్ కళ్యాణ మండపం" నందు ఈ యోగా తరగతులు నిర్వహించినారు.

ఈ విధంగా యోగా క్లాసులు కాకినాడ సబ్ డివిజన్‌లో ఉన్న పోలీస్ అధికారులకు మరియు సిబ్బంది అందరికి ఒక వారం రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని రఘువీర్ విష్ణు తెలియజేసినారు. అందరి ఆరోగ్యం దృష్ట్యా ఈ యోగా తరగతి నిర్వహించినందుకు, పై అధికారులకు ట్రాఫిక్ పోలీస్‌వారు కృతజ్ఞతలు తెలియజేసినారు.

# చిన్నాను పరామర్శించిన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ సోంబాబు



అంబాజీపేట, మేజర్ న్యూస్ : పితృవియోగంతో బాధపడుతున్న పిహెచ్‌సి మాజీ చైర్మన్ మేడిది చిన్నా కుటుంబాన్ని అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ సోంబాబు గురువారం పరామర్శించారు. చిన్నా తండ్రి వేణుగోపాలరావు చిత్రపటంవద్ద శ్రద్ధాంజలి ఘటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం చిన్నా కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. ఆయనతోపాటు పలువురు చిన్నా కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేసారు.

# ఘనంగా అయ్యప్ప పడిపూజ

కాకినాడ, మేజర్ న్యూస్ : అయ్యప్ప పూజ చేయడం ద్వారా భక్తులలో క్రమశిక్షణతో పాటు భగవంతుని పట్ల కృతజ్ఞతాభావాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉంటారని రత్నా ప్రింటింగ్ ప్రెస్ అధినేత చోడవరపు ప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక త్రిపుర సుందరి ఆలయం ప్రక్కన ఉన్న బాదం వారి వీధిలో సంతోషిమాత ఆలయ ప్రధాన అర్చకులు మంధా ముత్యాల మురళి శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో భారీగా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రసాద్ సూర్యకుమారి దంపతులు తొలుత అయ్యప్ప స్వామి వారిని ఆహ్వానించి విశేష మండపంలో ప్రతిష్ట చేయగా ముత్యాల మురళిశర్మ గురు స్వామి ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించి వచ్చిన స్వాములకు మరియు భక్తులకు వారి కుటుంబ సభ్యులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తి భావంతో నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అయ్యప్ప పూజ నిర్వహణ అనేది మానవులలో ఉన్న భక్తి భావాన్ని జాగృతి చేయడమే కాక మండలం పాటు దీక్ష కంకణ బద్ధులై పూజ నిర్వహించడం సుచికగా మరియు శుభ్రంగా జీవనాన్ని కొనసాగించడానికి అలవాటు అవుతుందన్నారు. ప్రతిరోజు రెండు పూట్ల స్నానాలను నిర్వహించడం తోపాటు ఐహీక సుఖాలకు దూరంగా





ఉండటం మరియు క్రమం తప్పకుండా పూజ నిర్వహించడం అయ్యప్ప స్వాముల గృహాలలో భిక్షను స్వీకరించడం వంటి ఉత్తమ లక్షణాలు అలవడతాయన్నారు. తారతమ్యం భేదం లేకుండా అందరూ సమానంగా ఉండే విధంగా ఆలోచన చేయడమే కాక స్వాములు ఎదురైనప్పుడు నమస్కరించడం పెద్దలకు నమస్కరించడం వంటి సద్గుణాలు జీవితంలో ఆచరించడానికి అలవాటుగా చేసుకుంటారని అంతటి మహిమ కలిగిన అయ్యప్ప దీక్షను స్వీకరించడం పూర్వజన్మ సుకృతంగా ప్రసాద్ ప్రస్తావించారు. ఈ అయ్యప్ప పూజ మరియు పడిపూజలలో కుటుంబ సభ్యులు భాగస్వామ్యం చేయడం ద్వారా అందరిలో ఆధ్యాత్మిక వాతావరణం అలవాటై నిత్యము వాటి ఆచరణకు కృతకృత్యులవుతారని ప్రసాద్ చెప్పారు. ఇంతటి విశేషమైన పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తోటి స్వాములందరూ సహకరించడం పట్ల ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకున్నారు అనంతరం విశేషంగా భజన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సుబ్బారావు శర్మ, విజయకుమార్ శర్మ, వీరభద్రుడుతోపాటు పలువురు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈనెల 28వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు బాల్యవివాహ ముక్త భారత్





కాకినాడ, మేజర్ న్యూస్ : ఈనెల 28వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు బాల్యవివాహ ముక్త భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐ.సి.డి.ఎస్. పి.డి. ప్రవీణ తెలిపారు. కాకినాడ గాంధీనగర్‌లో గల మహిళా స్త్రీ శిశు సంక్షేమ జిల్లా కార్యాలయంలో పి.డి. ప్రవీణ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి. ప్రవీణ మాట్లాడుతూ కాకినాడ జిల్లాని బాల్యావివాహ ముక్త జిల్లాగా ప్రకటించేందుకు ప్రతి ఒక్కరు తమ పిల్లలకు యుక్త వయస్సు వచ్చిన తరువాత మాత్రమే వివాహాలు చేయాలని అన్నారు. ఈ మీడియా సమావేశంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ స్వర్ణలత మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కాకినాడ జిల్లాలో 5 మండలాలు 50 గ్రామాలలో ప్రజలలో బాల్యా వివాహ ముక్త భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# జ్యోతిరావు పూలే దార్శనికుడు

**- వర్ధంతి కార్యక్రమాల్లో నులుకుర్తి నివాళి**



కాకినాడ, మేజర్‌న్యూస్ : సమాన హక్కుల కోసం అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప దార్శనికుడని టీడీపీ కాకినాడ రూరల్ ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వర్రావు అన్నారు. గురువారం కాకినాడ జిల్లా టిడిపి కార్యాలయంలో ఆయన నాయకులతో కలిసి మహాత్మా జ్యోతిరావు పూలే 134 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నులుకుర్తి మాట్లాడుతూ.. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతోపాటు మహిళోద్ధరణకు జ్యోతిరావు పూలే కృషి గొప్పదని, ఆ మహనీయుడు అందించిన స్ఫూర్తితోనే ఈరోజు బలహీనవర్గాల వారు రాజకీయ, ఆర్థిక తదితర రంగాల్లో ఎంతో ముందుకు వెళ్తున్నారన్నారు. జ్యోతిబా పూలే సమాజాభివృద్ధికి చేసిన కృషే నిదర్శనమని, సమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడని వెంకటేశ్వర్రావు కొనియాడారు. పూలే అడుగుజాడల్లోనే ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే నడుస్తూ స్త్రీల విద్య కోసం కృషి చేసి ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. నేడు సాధికారత కోసం మాట్లాడుకుంటున్నామని, వాటిని సాధించడం మన హక్కుగా గుర్తించాలని సమాజంలో ఆనాడే వీరిద్దరూ చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. అటువంటి మహనీయుల అడుగు జాడల్లో నడిచి పేదల అభివృద్ధి కోసం కృషి చేయాలని నులుకుర్తి వెంకటేశ్వర్రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కరప మండల అధ్యక్షులు దేవు వెంకటేశ్వరరావు, నాయకులు మాసుమేను గంగయ్య, కోనా వెంకటలక్ష్మి, దమ్ము నూకరాజు, మల్లంపల్లి నారాయణ, మాసుమేను శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య కళాశాలలో అవయవదానంపై అవగాహన కార్యక్రమం



కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో డాక్టర్ డి.వి.రాజు మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్ వారిచే అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. "మనం మరణించిన తర్వాత కూడా జనం మనల్ని గుర్తుపెట్టుకోవాలంటే చదవదగ్గ పుస్తకాలు రాయాలి లేదా రాయదగ్గ పనులు చేయాలి" - అన్న చందాన అవయవదానంతో మరొకరి జీవితంలో వెలుగునింపుతూ మరణం సంభవించినా మృత్యుంజయుడిలా బ్రతకమంటూ ఆదిత్య స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ కళాశాలలో అవయవదానం పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి. రాజు మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామస్వరూప్ జవహర్, ప్రముఖ సంఘసేవకులు, ఆర్గాన్ డొనేషన్ పిఆర్‌ఓ పాలడుగు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారుపాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ ఎండి షాహిద్దీన్ మాట్లాడుతూ మన అవయవాలు మరొకరికి జీవితాన్ని ఇస్తుంటే అంతకంటే ఆనందం మరొకటి ఉండదని అన్నారు. రక్తదానం, నేత్రదానం పట్ల ప్రజలలో అవగాహన ఉన్నదని ఇప్పుడు అవయవ దానంపై అవగాహన కలిగించడం గొప్పపరిణామమని అన్నారు. ఈ సందర్భంగా డా?డి. వి. రాజు మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏస్థితి లో ఏ అవయవాలను దానం చేయవచ్చునో విద్యార్థులకు వివరించారు. స్నేహ హాస్పిటల్ డాక్టర్ జవహర్ మాట్లాడుతూ మాట్లాడుతూ తోటివారికి సహాయం చేయడంలో ఆనందం ఉన్నదని విద్యార్థి యవత ఆరోగ్యంగా ఉంటూ అవయవదానం చేయడంలో ముందుండాలని అన్నారు.

అవయవదానంపై అపోహలు వద్దు అని అవగాహన చాలా అవసరమని అన్నారు. మానసికంగా దృఢంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మరణించిన తర్వాత మానవ శరీరం వృధా కాకూడదని శరీరంలో పనికివచ్చే అవయవాలు దానం చేయాలనే ఆలోచన అందరిలో కలగాలని అన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారితో అవయవదాన ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్.బృందాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషా రెడ్డి, డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ ఎన్. సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జట్ల గణేష్, ఎంబీఏ విభాగాధిపతి పి.గంగాధర్ , ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి టి.తేజేశ్వరరావు, బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అరటికాయ వర్తకులు, రైతులు కార్తీక వనసమారాధన



అంబాజీపేట, మేజర్ న్యూస్ : కార్తీక మాసం సందర్భంగా మండలంలో కార్తీక వనసమారాధనలను గురువారం ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో అరటికాయ వర్తకులు, రైతుల ఆధ్వర్యంలో వనసమారాధన చేపట్టారు. తొలుత స్థానిక ఉసిరి చెట్టు వద్ద అర్చకులు మర్ల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అరటి వర్తకులు, రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ వన సమారాధన జరిపారు. కార్యక్రమంలో అరటికాయ వర్తకులు, వ్యాపారులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో కొబ్బరి తోటల్లో భక్తులు వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వనసమారాధనలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

## పార్వతీ సమేత వీరేశ్వరస్వామికి వైభవంగా లక్షబిల్వార్చన



అంబాజీపేట, మేజర్ న్యూస్ : గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న పార్వతి వీరేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి కేశవస్వామి వార్ల ఆలయం వద్ద స్వామివార్లకు లక్షబిల్వార్చన గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళీ సూర్యనారా యణశర్మ, సుదర్శన కేశవాచార్యులు వేదమంత్రాల నడుమ స్థానిక శెట్టిబలిజ సంఘీయులు ఆధ్వర్యంలో స్వామివార్లకు లక్ష బిల్వార్చన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. అలాగే మాచవరం రాజరాజేశ్వరి, కందుల మల్లేశ్వరస్వామి ఆలయంలోను, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, మొసలపల్లి, వాకలగరువు, కె.పెదపూడి, ముక్కామల, ఇరుసుమండ, మాచవరం, గంగలకుర్రు, నందంపూడి, తొండవరం గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో స్వామివార్లకు లక్ష బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# జ్యోతిబా పూలే 134వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



కాకినాడ, మేజర్‌న్యూస్ : మహాత్మ జ్యోతిబాపూలే 134వ వర్ధంతి సందర్భంగా కాకినాడ సిటీ గర్ల్స్ పాలిటెక్నిక్ దగ్గర 93 బీసీ కులాల ఐక్యవేదిక మరియు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా ఆయనకు నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే ఒక బడుగు బలహీన వర్గాలకే కాకుండా యావత్ దేశంలో ఉన్న ప్రతి ఒక్కరు బడుగు బలహీన పేద అగ్రకుల వర్గాల వితంతువులకు విద్య కోసం పోరాటం చేసిన మహాయోధుడు మహాత్మ జ్యోతిబాపూలే వారు అగ్రకులాల వారితో సమానంగా ముందుకు సాగాలి అంటే విద్య ఒక్కటే దీనికి సరైన ఆయుధమని చెప్పి ఆయన ఆయన భార్య సావిత్రిబా పూలే ఇద్దరు కలిసి ఈ దేశా బడుగు బలహీన వర్గాలు పేద ప్రజల కోసం ప్రాణి త్యాగాలు చేసిన మహా దంపతులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థిని విద్యార్థులు పయనించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఈ మీడియా ద్వారా మా బీసీ బడుగు బలహీన వర్గాల విన్నపము గత ప్రభుత్వంలో అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తు విజయవాడలో పెట్టడం జరిగింది, అలాగే మహాత్మజ్యోతిబాపూలే విగ్రహాన్ని అమరావతిలో మీరు ఏ సంవత్సరంలో నిర్ణయం తీసుకుంటారో అప్పటికి ఎన్ని సంవత్సరాలో అన్ని అడుగులు ఎత్తు కాంస విగ్రహాన్ని పెట్టాలని మా 93 బీసీ కులాల ఐక్యవేదిక మరియు బీసీ జేఏసీ సంఘాల తరపున అన్ని బీసీ కుల సంఘ నాయకులు కోరుచున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ చోల్లంగి వేణుగోపాల్, పెరిక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వనపర్తి బద్రి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అవుపాటు ఉమాశంకర్, సంచార జాతులు డైరెక్టర్ పెద్దిరాజు, మాజీ శెట్టిబలిజ డైరెక్టర్ ప్రభాకర్, 44వ వార్డ్ మాజీ కార్పొరేటర్ హైవి రమణ, పెంకె శ్రీనివాస్ బాబా, తెలుగుదేశం రూరల్ నాయకులు రాయుడు నాగేశ్వరరావు, బీసీ నాయకులు పొన్నగంటి సత్యనారాయణ, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు ఆదిరెడ్డి ప్రసాద్, వెలమ నాయకులు బొబ్బిలి రాజేశ్వరరావు, బీసీ నాయకులు 44వ వార్డ్ ఉమా, కలిదిండి సురేష్, రాజ్ కుమార్, పెంకె శివ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

## సమ సమాజ స్థాపన కోసం నిరంతరం కృషి చేసినటువంటి మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే

**- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గం ఇంచార్జ్ తలారి**



కొవ్వూరు, మేజర్ న్యూస్ : సమ సమాజ స్థాపన కోసం నిరంతరం కృషి చేసినటువంటి మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గం ఇంచార్జ్ తలారి వెంకట్రావు అన్నారు గురువారం కొవ్వూరు లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఇంటికే పరిమితమైన మహిళలకు విద్య నందించాలని సంకల్పంతో తన ఇంటిని విద్యాలయంగా మార్చిన మహోన్నతుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. అంటరానితనం నిర్మూలనపై కుల వివక్షత పోరాటాన్ని చేసి సమ సమాజ స్థాపనకే కృషి చేసినటువంటి మహాత్మ జ్యోతిరావు పూలే జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బత్తి నాగరాజు,మద్దిపట్ల సాయి గీత,చాగల్లు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లింపుల దుర్గా మల్లేశ్వరరావు, గండ్రోతు సురేంద్ర, ఉప్పులూరి సూరిబాబు, చొప్ప అప్పలనాయుడు, దేవగుప్తాపు లక్ష్మణరావు, గంధం సాయి, గుబతాల సురేష్, మద్దిపట్ల దొరబాబు, మెరుపు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉడిపి స్వామీజీకి అపూర్వ స్వాగతం





కాకినాడ, మేజర్ న్యూస్ : ఉడిపి శిరూర్ మఠాధిపతులు శ్రీ వేద వర్దన తీర్థ స్వామీజీకి గురువారం మధ్యాహ్నం స్థానిక రాఘవేంద్ర స్వామి బృందావనం ప్రాంగణంలో శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావన సేవా సమితి ట్రస్ట్ మరియు భక్తులచే ఘనంగా స్వాగతం పలికారు. తోలుతా రాఘవేంద్ర స్వామి మఠా ప్రధాన అర్చకులు రవీంద్ర భట్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలుకుగా స్వామీజీకి పూలమాల ఆహ్వానించారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావనానికి స్వామీజీ ప్రత్యేక హారతులు చేశారు. భక్తులు ఉద్దేశించి స్వామీజీ మాట్లాడుతూ కలియుగ కల్పవృక్షమైన శ్రీ రాఘవేంద్ర స్వామి అనుగ్రహాన్ని అందరూ పొందాల్సిందేగా సూచించారు. హిందూ ధర్మ ప్రచారానికి అందరూ కంకణబద్ధులై ఉండాలన్నారు. ఆధ్యాత్మికం అనేది సమాజ అభివృద్ధికి దిక్సూచి వంటిదని స్వామీజీ అన్నారు. సమితి ట్రస్ట్ కమిటీ కోశాధికారి వై వెంకటేష్ సభ్యులందరినీ పరిచయం చేశారు.

మఠ ప్రధాన అర్చకులు రవీంద్ర భట్ కుమారుడు చిరంజీవిప్రాణేష్ భట్టు హనుమాన్ వేషధారణ అందరిని అబ్బురపరిచింది. కార్యక్రమంలో శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావన సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షులు భగీరథ శర్మ, కార్యదర్శి వై.రాఘవేంద్రరావు, సంయుక్త కార్యదర్శి సత్యరాజు వెంకటరత్నం, కోశాధికారి వై.వెంకటేష్, ఉపాధ్యక్షులు ఎస్.అనంత రామారావు, కాకినాడ మధ్వ సభ కమిటీ కోశాధికారి వేముగంటి రాము, సంయుక్త కార్యదర్శి డాక్టర్ యాతగిరి పరశురామ్, కార్యవర్గ సభ్యులు రాచూరి శేషగిరిరావు, మాధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్, శ్రీ బాలాజీ ఫర్నిచర్స్ అధినేత బి.శ్రీనివాసరావు, మాధ్వపురోహితులు యాతగిరి పరశురామాచార్, రాచూరి రామకృష్ణ భక్తులందరికీ స్వామీజీ ఆశీర్వచన పూర్వక మంత్రాక్షితలు అందజేశారు. ఉడిపి శ్రీకృష్ణ పూజా పర్యాయ తాలూకు ఆహ్వాన పత్రాలను స్వామీజీ భక్తులకు అందజేసి 2026 నుండి రెండు సంవత్సరాల పాటు జరిగే పర్యాయ పూజల్లో పాల్గొనవలసిందిగా స్వామీజీ భక్తులను ఆహ్వానించారు.

# మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే

**- బి.సి.సేన అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు**



రామచంద్రపురం, మేజర్ న్యూస్ : భారతదేశ ప్రథమ సామాజిక తత్వవేత్త, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతోపాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని నియోజకవర్గం ఎం.బీ.సీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు అన్నారు. యాట్ల ఆధ్వర్యంలో పూలే 134వ వర్ధంతి సందర్భంగా ద్రాక్షారామ మసీదు సెంటర్‌లో ఉన్న పూలే దంపతులు విగ్రహాలకు ప్రజా సంఘాలు సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం, కొత్తపల్లి దుర్గా ప్రసాద్, కోసనా కామేశ్వరరావు, నేదునూరి సూరిబాబు, మేడిశెట్టి శ్రీనివాస్, గారోజు సూరిబాబు, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ 1873 సెప్టెంబర్ 24 న పూలే తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ స్థాపించారని తెలిపారు. నూతన పార్లమెంటు ఆవరణలో పూలే విగ్రహంగా ఏర్పాటు చెయ్యాలని, రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో పూలే స్మృతి వనం ఏర్పాటు చెయ్యాలని, పూలే జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిళ్ళకుర్తి స్వామి, కణితి రాంబాబు, ఎస్. సాయిబాబు, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నివారణపై కొవ్వొత్తుల ర్యాలీ ర్యాలీ




**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** బాల్య వివాహాల నివారణపై బుధవారం జగ్గంపేట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట సీఐ వై.ఆర్.కె శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి హాజరయ్యారు. ఈసందర్భంగా సెంటర్లో అంగన్వాడీలు మానవహారంగా ఏర్పడి బాల్య వివాహాలు వద్దు చదువు ముద్దు అనే నినాదాలు చేశారు. సీఐ వై.ఆర్.కె మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్య లు తప్పవని హెచ్చరించారు. బాలికలను చదివించి ఉన్నత విద్యావంతులు చేయాలని సూచించారు. వివాహ వయస్సు వచ్చాక మాత్రమే వివాహాలు చేయాలని అప్పటి వరకు వారిని చదివించాలని ప్రభుత్వం ఎన్నో వసతులు కల్పిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు సునీత, బూసమ్మ, నాగ పార్వతి, అమ్మాజీ, కరీమున్నిసా, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించాలి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించాలని ప్రధానో పాధ్యాయులను అధికారులు ఆదేశించారు. గురువారం మండల విద్యా వనరుల కార్యాలయం వద్ద ప్రధానోపాధ్యాయులతో అధికారులు సమావేశంనిర్వహించారు. డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ ఉపాధ్యాయులు సమావేశంలో ప్రణాళిక రూపొందించడం కొరకు ఏమేమి చేయాలి అనే వాటిపై తాసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, ఎం ఈ ఓ సత్యనారాయణ దొర వివరించారు. పేరెంట్స్ మీటింగ్ కి తప్పనిసరిగా ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు హాజరు కావాలని దీనిపై హెచ్ఎంలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి అధికారులు నుండి ఉత్తరువులు వచ్చినట్లు వారు తెలిపారు.

# 2024-25 రబీలో తూర్పు,పశ్చిమ,మధ్య డెల్టాలోని 8,96,507 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

- డిసెంబర్ ఒకటవ తేదీన కాలువకు నీరు విడుదల
- ప్రజల అవసరాలకు అనుగుణంగా త్రాగునీరు విడుదల.
- ఎర్ర కాలువ, కొవ్వాడ కాల్వ గండ్లు పూడ్చి ఆధునీకరణ పనులకు శాశ్వత ప్రాతిపదికన ప్రతిపాదన అందజేయాలి
- జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కలెక్టర్ పి ప్రశాంతి

**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ :** గోదావరి నదిపరివాహక ప్రాంతంలోని ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి తూర్పు,పశ్చిమ,సెంట్రల్ డెల్టా ప్రాంతాలకు 2024-25రబీ సీజన్లో 8,96,507ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, త్రాగునీటి అవసరాలకు సంబంధించి డిసెంబర్ 1వ తేదీన నీటిని విడుదల చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన తూర్పు గోదావరి జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతవహించారు.ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డిఆర్ఓ సీతారామమూర్తి, ఆర్డిఓలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.ఈసందర్బంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ,2024-25 రబీ సీజన్లో ఆయకట్టు కింద గోదావరి డెల్టా క్రింద డిసెంబర్ 1వ తేది నుంచి 2025 మార్చి వరకు 8,96,507 ఎకరాల ఆయకట్టుకు సాగు, త్రాగునీరు అవసరాలకు



నీటిని విడుదల చేయటం జరుగుతుందన్నారు . ఇందులో భాగంగా తూర్పు డెల్టాకు 2,64,507 పశ్చిమ డెల్టాకు 4,60,000 సెంట్రల్ డెల్టాకు 1,72,000 ఎకరాల ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చెయ్యనున్నట్లు తెలిపారు.ప్రస్తుతం గోదావరిలోనదిలో 91.35 టిఎంసిల నీరు అందుబాటులో ఉందన్నారు. తూర్పుగోదావరి జిల్లా రబీ ఆయకట్టుకు సంబంధించి గోదావరి తూర్పు డెల్టా కడియం అనపర్తి, బిక్కవోలు మండలాల సంబంధించి 27,001 ఎకరాల ఆయకట్టుకు, గోదావరి పశ్చిమ డెల్టా క్రింద కొవ్వూరు నిడదవోలు ఉండ్రాజవరం పెరవలి మండలాలకు సంబంధించి 35,710 ఎకరాల ఆయకట్టుకు, తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం ద్వారా కోరుకొండ సీతానగరం మండలంలో 1650 ఎకరాల ఆయకట్టుకు మొత్తం 64,361 ఎకరాల ఆయకట్టుకు రబీలో సాగునీరు విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎర్ర కాలువ, కొవ్వాడ కాల్వ క్రింద గోపాలపురం, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లోని ఆయకట్టు వరదలు, భారీ వర్షాలు కారణంగా ప్రతి ఏటా అనేక వేల ఎకరాల ఆయకట్టు ముంపుకు గురవుతున్నాయని, కాల్వలను ఆధునీకరణ పనులు చేపట్టి, గండ్లను పూడ్చివేసి ఏటిగట్ల పటిష్టవంతం చెయ్యాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎర్ర కాలువ,కొవ్వాడ,చింతలపూడి,తొర్రిగడ్డ, సీతానగరం, ప్రాజెక్టుల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఆయా ప్రాజెక్ట్ పరిధిలో సీజన్ వారీగా సాగు విస్తీర్ణం, ఆయకట్టు సాగు అంశాలకు సంబంధించిన అంశాలను నివేదిక రూపంలో కలెక్టర్కు వివరించారు. పురుషోత్తపట్నం చింతలపూడి, పట్టిసీమ వెంకట నగర్ ఎత్తిపోతల పథకం పనితీరుపై ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులతో ఇరిగేషన్ పనులు పురోగతిపై సమీక్షించారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ .చిన్నరాముడు, డిఆర్ఓటి.సీతా రామమూర్తి, జిల్లా నీటిపారుదలఅధికారి జి. శ్రీనివాసరావు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్,రాణిసుస్మిత,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, ఎల్.ఎం.సి.లెఫ్ట్ కెనాల్ ఎస్. ఈ, ఏసు బాబు, ఏలూరు ఎస్.ఈ.. దేవ ప్రకాష్, ఆర్. డబ్ల్యూ. ఎస్.ఎస్ ఈ,బి.వెంకటగిరి, వ్యవసాయశాఖ ఏడీలు, పి.చంద్ర శేఖర్, డి.వి.కృష్ణ, డి.శ్రీనివాస రెడ్డి, బి.కె.మల్లి ఖార్జున రావు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కానూరు వల్లభస్వామి గుడి వద్ద భారీ అన్నసమారాధన



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వల్లభస్వామి ఆలయం వద్ద నవంబర్ 28వ తేదీ గురువారం కార్తీక మాసం సందర్భంగా భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. కానూరు గ్రామంలో కార్తీకమాసం సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా శ్రీదేవి,భూదేవి సమేత వల్లభస్వామి వారి గుడి దగ్గర జరిగిన ఈ అన్నసమారాధన కార్యక్రమం లో సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యులు మరియు ఇంఛార్జి బూరుగుపల్లి శేషారావు వేలివెన్ను నీటిసంఘం అధ్యక్షులు బూరుగుపల్లి శ్రీనివాస్ కానూరు తెదేపా అధ్యక్షులు ముల్లపూడి రాజేంద్రప్రసాద్ కెవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# స్వనిధి కుడా - స్వాభిమాన్ కుడా పై వీధి వ్యాపారులకు అవగాహన



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పెద్దాపురం పురపాలక సంఘం నందు వీధి వ్యాపారులును ఆన్లైన్ చేయడం జరిగిందని, మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ వివిధ బ్యాంక్ల నుండి చిరు వ్యాపారాలు చేసుకునే వారికి రూ.10వేలు, 20వేలు, 50వేల వరకు 7శాతం వడ్డీ రాయితీతో రుణాలు ఇప్పించడం జరిగిందని, స్వానిధి - స్వాభిమాన్ 15 రోజుల పాటు పెండింగ్ రుణాలు పంపిణి, సామాజిక, ఆర్థిక ప్రొఫైల్, కేంద్ర సామాజిక ఆర్థిక భద్రత పథకాల నందు వీధి వ్యాపారులను, వారి కుటుంబ సభ్యులను నమోదు చేయుట, వీధి వ్యాపారుల ద్వారా డిజిటల్ లావాదేవీలు చేయించుట, మొబైల్ యాప్ డౌన్లోడ్ చేయుట కార్యక్రమాలు ప్రధానమంత్రి వీధి విక్రయదారుల ఆత్మ నిబ్బర్ నిధి (పిఎం స్వానిధి) డిశంబర్ 2వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎంఎం తెలిపారు. ఈ కార్యక్రమాలు బ్యాంక్ల నందు, చిరువ్యాపారాలు చేసుకునే వ్యాపారాల దగ్గర, వారికి డిజిటల్ లావాదేవీలు చేయించుట మొదలగు కార్యక్రమాలు చేయడం జరుగుతుందని సిఎంఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఓలు శ్రీదేవి, టిఎల్ఎఫ్ ఆర్పి సత్యవాణి, మహిళా సంఘాల సభ్యులు, ఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులలో 600 లీ. బెల్లపు ఊట ధ్వంసం



**పెద్దాపురం,మేజర్న్యూస్ :** పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి. అర్జునరావు ఆదేశాల మేరకు ఆధ్వర్యంలో పెద్దాపురం సర్కిల్ పరిధిలోని గండేపల్లి మండలం లోని బొర్రంపాలెం గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 600 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేయడం జరిగిందని ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు ప్రసాదరావు మరియు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో ఎక్సైజ్ ఆధ్వర్యంలో దాడులు

- డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దాడులు
- మూడు వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- డిఈపిఓ సిహేచ్ లావణ్య



**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గురువారం డ్రోన్ ద్వారా సర్వే చేపట్టి అక్రమంగా నిలవ ఉంచిన బెల్లం ఊట ను గుర్తించి ధ్వంసం చెయ్యడం జరిగిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సిహెచ్. లావణ్య తెలియ చేశారు.రాజమహేంద్రవరం ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నార్త్, సౌత్ స్టేషను పరిధిలోని బృందాలతో కలిసి గోంగూర లంక, వెంకటనగరం లంక, పిచుక లంక, బొబ్బిలి లంక వద్ద డ్రోన్ ఉపయోగించి సంయుక్త దాడులు నిర్వహించామనీ తెలిపారు. .ఉత్తర మరియు దక్షిణ స్టేషన్ పరిమితుల్లో మరియు 1800 లీటర్లు ,150 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా దేవరపల్లి స్టేషన్ పరిధిలో 1200 లీటర్ల బెల్లం ఊట ను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా బెల్లం ఊట నిల్వలు ఉంటే సమాచారం అందించి సహకరించాలని, అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు.

## తూర్పు - పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలికి పంపించండి

- ఉపాధ్యాయ, అధ్యాపక ఓటర్లకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజ్ఞప్తి




**కాకినాడ, మేజర్ న్యూస్ :** డిసెంబర్ 5వ తేదీన జరగబోతున్న తూర్పు - పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక ఓటర్లందరూ తనను బలపరిచి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలికి పంపించాలని పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి విజ్ఞప్తి చేశారు.గురువారం సాయంత్రం కచేరీపేటలో గల యుటిఎఫ్ జిల్లా కార్యాలయమైన వి. సూర్యనారాయణ రాజు టీచర్స్ హెూంలో గోపిమూర్తి మీడియాతో మాట్లాడారు. తనను శాసనమండలికి పంపిస్తే ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల సమస్యల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడతానని, ప్రజాసంఘాల ఉద్యమాల వాణిని మండలిలో వినిపిస్తానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చరిత్రలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల వారసుడిగా నిజాయితీ గా, అభ్యుదయ విలువలకు కట్టుబడి, చిత్తశుద్ధిగా ప్రజాపక్షం వహిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి, జిల్లా అధ్యక్షులు కె.వి.వి.నగేష్, అసోసియేట్ అధ్యక్షులు బి.నాగమణి, వి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్సిలలో మెరుగైన సేవలు అందించాలి

- దోసకాయలపల్లి పి హెచ్ సి ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టరు ప్రశాంతి



**కోరుకొండ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకి మెరుగైన సేవలు, చికిత్సా విధానాలు అందుబాటులో ఉండేలా క్షేత్ర స్థాయి సిబ్బంది పని తీరు ఉండాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం ఉదయం స్థానిక పి హెచ్ సి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రికి వైద్య సేవలు నిమిత్తం వొచ్చిన వారితో సంభాషించి వివరాలు తెలుసుకోవడం జరిగింది. పి హెచ్ సి లో ఏ ఎన్ ఎం లు ఎందుకు ఉన్నారో అడిగి తెలుసుకోవడం తో పాటు, వారు సేవలు అందించే గ్రామాల వివరాలు, అక్కడ ఎంత మంది గర్భిణీలు బాలింతలు ఉన్నారు, వారి అంద చేస్తున్న వైద్య అనుబంధ సేవల వివరాలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లడుతూ, ప్రభుత్వాలు ప్రజలకు మెరుగైన చికిత్స అందించడం కోసం తగిన మౌలిక వసతులు కల్పించడం తో తదనుగుణంగా పరికరాలను కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నేపధ్యంలో గర్భిణీ స్త్రీలకు నార్మల్ డెలివరీ అయ్యేందుకు కావలసినవి సూచనలను సలహాలను ఇవ్వడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. కొందరు ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స కోసం సిఫార్సు చేస్తున్నట్లు తమ దృష్టికి రావడం జరిగిందన్నారు. మీ ఆధ్వర్యంలో పనిచేసే ఉద్యోగుల పనితీరు పర్యవేక్షణా బాధ్యత మీపై ఉందనే విషయం కలెక్టరు గుర్తూ చేశారు. ప్రతి ఒక్క డెలివరీ కేసు ను మొదటి నుంచి పర్యవేక్షణా చెయ్యడం లో వారి ఆరోగ్య స్థితిగతులను అధ్యయనం చేసే అవకాశం ఉందని, ఆమేరకు వైద్య సేవలు అందించే బాధ్యత మనందరిపై ఉందనీ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు.పి హెచ్ సి వైద్యాధికారి డా వి. కోటేశ్వరరావు ఆసుపత్రిలో అందచేస్తున్న సేవలను వివరించారు. ఆసుపత్రి వైద్యులు గ్రామ స్థాయిలో వైద్య సిబ్బంది అందించే సేవల వివరాలు తెలుసుకోవడం, వాటి రికార్డుల నిర్వహణ పై జూమ్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ నేపధ్యంలో సిబ్బంది రావడం జరిగిందన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

- నివాళులర్పించిన పిఠాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి వంగా గీత విశ్వనాథ్




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా... పిఠాపురం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్చార్జి వంగా గీత విశ్వనాథ్ ఆధ్వర్యంలో... మహాత్మ జ్యోతి రావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహాత్మ జ్యోతిరావు పూలే అంటరాని తనం, కుల వివక్షలేని సమాజం కోసం జీవితకాలం పోరాడిన మహెూన్నత వ్యక్తి అని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేసిన వ్యక్తిగా మహాత్మ జ్యోతిరావు పూలే చరిత్రలో నిలిచిపోయారన్నారు. మహిళలకు విద్యను అందించాలన్న మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల ముందు చూపుతో భారతదేశం మహిళా సాధికారత దిశగా అడుగులు వేసేందుకు అవకాశం కలిగిందన్నారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో బడుగు, బలహీన వర్గాలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడంతో పాటు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయించిన ఘనత మన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని ఆమె తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అణగారిన వర్గాలు, బడుగు బలహీన వర్గాలు, మహిళల పురోగతికి తన 5 సంవత్సరాల పదవీకాలంలో అన్ని విధాలా అండగా నిలిచారని, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి పేదలకు మెరుగైన వసతులతో కూడిన విద్య, వైద్యం అందించారన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం జగనన్న ఆధ్వర్యంలో నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయులు జ్యోతీరావు పూలే

- జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించిన..
- జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు



**రాజమహేంద్రవరం, మేజర్న్యూస్ :** బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయులని జ్యోతీరావు పూలే అని జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ముఖం ద్వారం వద్ద హాలో జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, డిఆర్ఓ సీతారామమూర్తి తో కలసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతీరావు పూలే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వారి హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయులన్నారు. విద్య, సామాజిక సంస్కరణలు, ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకుడని, తన జీవితాంతం బాలికల విద్య కోసం పోరాడరన్నారు. అభాగ్యులైన పిల్లల కోసం అనాథాశ్రమాన్ని ప్రారంభించి సమాజాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.ఎన్ జ్యోతి, బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్య రమేష్,జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నడిపల్లి కోట గ్రామంలో 104 సేవలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** నడిపల్లి కోట గ్రామంలో నవంబర్ 28వ తేదీ గురువారం 104 శిబిరం నిర్వహించారు. ఈ 104 క్యాంపు నందు ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధముగా ప్రజలకు బిపి షుగరు మరియు ఇతర వ్యాధుల పరిశీలించి వారికి మందులు ఉచితంగా అందజేసి తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీర సత్యవేణి రాజు హాజరయ్యి గవర్నమెంట్ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రతి గ్రామానికి 104 అంబులెన్స్ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వైద్యం అందించే విధముగా ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. తమ వద్దకే వైద్యులు వచ్చి సేవలు అందించడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్.ఎంలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొని ప్రజలకు సేవలు అందించారు.

# వెంకన్న ఆలయంలో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు ప్రత్యేక పూజలు



**ఆత్రేయపురం,మేజర్న్యూస్:** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకున్న టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తరపున దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు స్వాగతం పలికారు. అనంతరం వాడపల్లి ఆలయంలో టిటిడి చైర్మన్ బి. ఆర్ నాయుడుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మండల టిడిపి అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆలయ వేద పండితులు వేద వచనాలు పలుకుతూ స్వాగతం పలికి స్వామివారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి చిత్రపటాన్ని టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడు దంపతులకు కుటుంబ సభ్యులకు బహుకరించారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంతో పోటీపడుతూ కోనసీమలో వాడపల్లి వెంకటేశ్వర స్వామిభక్తజననీరాజనాలు అందుకుంటున్నారని అన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు ఈసందర్భంగా ఆలయఅభివృద్ధికి చేపడుతున్న మాస్టర్ ప్లాన్ గురించి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడుకు వివరించారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు ఉన్నారు

# సీనియర్ నాయకుడు జక్కంశెట్టి మృతి

- సంతాపం తెలిపిన పలువురు నాయకులు

**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి గ్రామంలో నివాసముండే ముక్కామల గ్రామానికి చెందిన బీసీ నాయకుడు జక్కంశెట్టి సత్య రాజేంద్రప్రసాద్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతూ నవంబర్ 27వ తేదీ బుధవారం మృతి చెందారు. ఈయన కాంగ్రెస్, తెదేపా, వైఎస్ఆర్సిపి, పార్టీల్లో పలు కీలక పదవి బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర శెట్టిబలిజ సంఘం ఉపాధ్యక్షుడిగా తణుకు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి పార్టీ నియోజకవర్గ కన్వీనర్గా, రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం స్టేట్ డైరెక్టర్గా బాధ్యతలు నిర్వహిం చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బీసీ నాయకుడిగా మంచి గుర్తింపు పొందారు.